# కొండనాలుకకు మందువేస్తే

"బాస్ వస్తే నేనే ఫోను చేస్తాను కదండీ?" స్టెనో గొంతులోని విసుగు నేను గమనించకపోలేదు. "బాస్ గురించి మీరు రావటం యిది నాలుగోసారి"

నిజమే! ఆఫీస్‌కి వెళ్లి గంట గడవలేదు గానీ, నేను బాస్ గురించి వెళ్ళడం యిది నాలుగోసారి!

నెలరోజులుగా బాస్ ఊరిలో లేరు, సెలవులో వెళ్ళారు, సెలవులో వెళ్ళేటప్పుడు మా సెక్షన్ బాధ్యతలు అన్నీ నాకే అప్పగించారు. ఈనెలరోజులలో నేను చేసిన ప్రశంసనీయమైన పనులు గురించి బాస్‌కి చెప్పాలని నా తపన. అందులోనూ ముఖ్యంగా కేంటీన్‌లో జరగిన విషయం గురించి.

నెలల తరువాత వస్తున్న భర్తను కలుసుకొని అతను లేనప్పుడు జరిగిన విషయాలని విన్నవించుకోటానికి ఉబలాటపడే సాధారణ ఇల్లాలిలా ఉంది నా మనస్సు

"బాస్ వస్తే చెప్పండి" నేను వెనక్కు తిరుగుతూ అన్నాను. " క్లబ్‌లో వుంటాను" .

కార్మాగారానికి ఓ కిలోమీటరు అవతల వుంది కార్మికుల కాలనీ అక్కడే వుంది క్లబ్ కూడా కార్మిక సంక్షేమాధికారిగా ఆ క్లబ్ మంచీ, చెడులు చూడటం నా ఉద్యోగ ధర్మం.

"భలేపనిచేసారు సార్" క్లబ్ మెట్లు ఎక్కకముందే పలుకరిస్తూ అన్నాడు రవి. రవి మా కర్మాగారారములో ఉద్యోగస్తుడు. "ఇన్ని సంవత్సరాలకు, మీరూ పని చేయ్యగలరనీ ఖచ్చితంగా వుండగలరనీ, ఋజువు చేసారండి" ఎగురవెయ్యబోయే గాలిపటానికి తాదు చుదుతూ అన్నాడు నేనేమి అనలేదు ఎదురుగా పిల్లలుగాలి పటాలు ఎగురవేస్తున్నారు. వాటిని చూస్తూ నిలబడ్డాను.

చిత్తుకాగితాలకు చెత్త కాగితాలకు, రంగు కాగితపు ముక్కలు అంటించి ఎగురవేసే గాలపటాలన్ని చూస్తూ వుంటే అవి గాలిపటాలు కావు మాలాంటి ఆఫీసర్లేనని

అనిపించంది నాకు. బాస్ సమర్ధవంతుడయితే తనకు కావల్సినవారికి మంచి రంగు కాగితాలు అంటించి బాగా కనపడేలా పైకి ఎగురవేస్తాడు. ఏ చిక్కులో పడినా, జాగ్రత్తగా ముళ్ళు విప్పి ఆకాశానికి దగ్గరగా చేస్తాడు. కావాల్సినవారు కాకపోతే ఎగురవేసినట్టే ఎగురువేసి ఎక్కడో చిక్కుల్లో యిరికించి తాడు తెంపేస్తాడు.

" ఏమిటి అలా నిలబడిపోయారు?..." రవి అడిగేడు " మొన్న మన కేంటీన్ కంట్రాక్టర్‌ని భలే పట్టుకున్నారండి" అతను అన్నాడు. " మీకు వెన్నెముక లేదనీ, ఏమీ చెయ్యలేరనీ బహిరంగంగా అరచినవాళ్ళు కూడా మిమ్మల్ని మెచ్చుకుంటున్నారు సార్".

నిజమే! మొన్న కేంటీన్‌లో జరిగిన సంఘటన వలన నేను అనుకున్నట్టుగానే నేలకు ఒరిగిపోయే నా పరువు, ప్రతిష్ట కొద్దిగా పైకి లేచింది.

ఉద్యోగస్థుల కొరకు ఏర్పాటు చేసిన కేంటీన్‌లో భోజన సదుపాయాలు బాగాలేవని, కార్మికులు, ఆఫీసర్లు చెప్తూనే వున్నారు. చెప్పటమే కాదు, కేంటీన్ బాధ్యత నిర్వహిస్తున్న నన్ను కాంట్రాక్టర్ తొత్తు అని తిడుతూ పత్రాలు కూడ విడుదల చేసారు. ఉద్యోగస్తుల భోజనం కొరకు యిచ్చే సరుకులు కర్మాగారం దాటిపోతున్నాయని కార్మికుల అభిప్రాయం అది నిజమేనేమోనని నాకూ అప్పుడప్పుడూ అనిపిస్తూ వుండేది. ఆ సంగతే మా బాస్‌తో అన్నాను.

" ఊరుకోవయ్యానువ్వు మరీ అంటావ్" మా బాస్ అన్నారు. " మనమిచ్చిన సరకులు అతను తీసుకొని వెళ్ళటమేమిటి? నీకు తెలీదేమో, అతనికి సిటీలో ఒక మంచి హోటల్ వుంది".

" ఉద్యోగస్తులు కూడా ఆ మాటే అంటున్నారు సార్. ఇక్కడి సరుకులతోనే అక్కడి హోటల్ నడుస్తోందని."

" చూడు మిస్టర్ రావ్" బాస్ మాటలు పరుషంగా వచ్చాయి." కార్మికులు ఏవేవో అంటూనే వుంటారు. మనం అవి ఏమీ పట్టించుకోకూడదు."

ఉద్యోగస్తుల మాటలు నిజమో, కాదోనాకు తెలీదు. కానీ వాళ్ళ దృష్టిలో నా పరువు ప్రతిష్టలు రోజు రోజుకు దిగజారిపోతున్నాయని తెలిసింది. వాళ్ళు అనే మాటలకు నా యువరక్తం ఉడికింది. ఎలాగోలాగ నా పరువు ప్రతిష్టలు నిలబెట్టుకోవాలని నిర్ణయించుకున్నాను. అవకాశం కొరకు ఎదురుచూసాను.

ఎదురు చూసిన ఆ అవకాశము రానే వచ్చింది. బాస్ నెల రోజులు సెలవులో వెళ్ళారు, సెక్షన్ నాకు అప్పగించి.

కేంటీన్ నుంచి సరుకులు బయటకు తీసుకొని వెళ్తున్న కేంటీన్ కాంట్రాక్టర్ దొరికిపోయాడు. ఉద్యోగస్తులు నన్ను ప్రశంసించారు. ఈ సారి ప్రమోషన్ కానీ, భారీ యింక్రిమెంటు కానీ ఖాయం!

ఫోన్ మ్రోగింది. బాస్ వచ్చారట.

ఒక్క ఉరుకుతో బాస్ కేబిన్‌లో వాలాను, నేను. వివరమంతా అతనికి చెప్పాలి కదా! అసలే యింక్రిమెంట్ వచ్చే రోజులు.

" ఏమిటి ఈ హడావిడి?" ఏదో ఫైలు చూస్తున్న బాస్ తల ఎత్తకుండానే అడిగారు. " నాలుగురోజులు సెక్షన్ చూసుకోమని అప్పగిస్తే కొమ్ములు వచ్చి పొడుస్తున్నావట?" అతను ఎర్రసిరాతో ఫైల్లో ఏదో రాస్తూ తల ఎత్తారు.

" మన కేంటీన్ కాంట్రాక్టర్...." నేను గబగబ మాట్లాడలేకపోయాను బాస్ మొహం చూస్తుంటే నాకువణుకు వచ్చింది.

"అతడు నాకు విషయమంతా చెప్పాడులే పొద్దున్నే నన్ను కలిసాడు".

నేను హాయిగా ఊపిరి పీలుస్తూ అన్నాను "అయితే మీకు అంతా తెలిసిపోయిందన్న మాట".

" తెలుసుకోవడానికి ఏముంది? నువ్వు అతన్ని అల్లరి పెట్టావట, దొంగలా పట్టించావట", బాస్ మొహం ఎర్రగా కందిపోయింది.

" అల్లరి పెట్టడమా"

"కాకపోతే ఏమిటి? అంత పెద్ద మనిషిని కంపెనీ సరుకులుపట్టుకు పోతున్నాడని పట్టిస్తావా?"

నాకేమనాలో తోచలేదు, ఎంతయినా బాస్‌లు కాంట్రాక్టర్ల పక్షమేయుంటారేమో!

"అతను నష్టపరిహారం అడుగుతున్నాడు, పరువు పోయినందుకు. అంతే కాదు రేపటినుంచి కేంటీన్ నడపటానికి మరొకరిని చూసుకోమంటున్నాడు".

' అది కాదు సార్'

"నువ్వు నాకేమి చెప్పనక్కరలేదు..."

మళ్ళీ ఎర్రసిరాతో ఫైల్లో ఏదో రాస్తూ అన్నారు బాస్ చేసిన నిర్వాకము చాలు. యికమీదట ఆ క్లబ్బులోనే పడివుండు కేంటీన్ గడప తొక్కకు ఎర్రసిరాతో గీతలు గీసి ఫైలు మూసేసారు అతను.

నాతల తిరిగిపోయింది. నేల కొరిగిపోతున్న పరువు ప్రతిష్టలని నిలబెట్టుకోవాలని చేసిన ప్రయత్నం యిలా బెడిసికొట్టింది.

కొండనాలికకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడటం అంటే యిదే కాబోలు అని అనుకున్నాను, నన్ను నేనే తిట్టుకుంటూ.

రాఘవీస్ కోకికి మే 1996